దరిద్రంలో కవిత్వం

[చిన్న కథ]

'బీదకవుల రచనలు కారుచౌకలో కొట్టేస్తూ... బొర్ర పెంచేసుకుని... ఇవాళ ఎలా అలంకరించావో కొట్టు! గుమ్మంముందు కదళీస్తంభాల్లో దుర్భోజనంలో కృశించి మడిసిన బీదకవుల కంకాళాలు ... గుమ్మాలకు కట్టిన ఆకుతోరణాల్లో పేదకవుల ఆకలిపేగులు...'

రచయిత:

పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.యే.

౧

విజయదశమినాడు—

మామూలుగా ఆరుగంటలు కాకముందే లేచి, చంటిదాన్ని భర్తమంచం మీదికి మార్చి, తన పక్క చుట్టేసుకుని, పాచి పనుల్లో నిమగ్న అయింది సరస్వతి.

ఏడుగంటలు అయాక, అతనికి మెలకువ రాగానే— అంతకుముందే పసిది లేచి ఎంతసేపయిందో మరి—పక్కనే కూచుని, ముక్కు, చెవో పట్టిపీకుతూ, జిలిబిలి కేకలు వేస్తూ, తన్ను లేపటానికి తంటాలు పడుతూండటం చూచాడు. అతడు కండ్లు తెరవగానే ఆ పిచ్చి పాపాయిముఖం ఇంతై—నోరంతా దాకలాగ తెరచి—కింది వరసలో వచ్చిన రెండుపళ్ళూ అందం చిలుకుతూంటే—

ఎన్ని జన్మాల బాంధవ్యమో పులకరించేటుగా ప్రవహించింది.

వెల్లకిల పడుకున్నవాడు లేవకండానే, మీది కెగబ్రాకి వస్తోన్న పసిదాన్ని గుండెలమీద కెత్తి కూచోబెట్టి పట్టుకున్నాడు.

ఏమి చిలిపితనం! కొంటెపిల్ల! క్షణం సేపు ఊరకుండదు కద! రెండు కాళ్ళూ తీసుకొచ్చి తండ్రిముఖాన పెట్టమ్మా? ముందుకు వాలి ఆయనజుట్టు పీకుతూ, చెంపలు రక్కుతూ నానా అల్లరి చేస్తోంది. ఇంత అవమానం జరుగుతున్నా అతడూ ఉప్పొంగి పోతున్నాడు. దాని చిలిపి కేకలను కసరుకోడేం? వాటిల్లో సృష్టిసౌందర్యాన్ని స్ఫురించిన ప్రకృతిమాత గానం వింటున్నాడా?

కన్నులు బాగా తెరిపిడి పడ్డా— ఇంకా బాహ్యప్రపంచం చూడకముందే—ఆ పసినిసుగు సృష్టించిన వేరే ఒక అనిర్వచనీయ- ఆనందమయ-అమృత ప్రవాహంలో మునకలు వేస్తూ - నిద్రాజాగ్రదవస్థల తారతమ్యం తెలీనిస్థితిలో- ఆత్మ కింపైన భోజనానికికూడా మొగం వాచిన బీదకవి నన్నసంగతే మరచిపోయి—తానుకూడా నిలువునా ఒక పసిపాప అయిపోతూ ఉన్న ఆ దివ్య ముహూర్తాన—

'అయ్యో కూతుళ్ళకు ఎంత పొద్దెక్కిందోకూడా తెలీటం లేదు; ఇక లేవమ్మా. మీరు దబ్బున తలంటి పోసుకుని బజారు కెళ్ళి రావాలి కూడాను.' అంటూ మల్లాలో సరస్వతి పిల్లదానికి ఉగ్గు పెట్టేందుకు గూటిలోనించి అముదంగిన్నె తీస్తూ కనిపించింది అతనికి.

మధురగానంలో అపశ్రుతి!

ఉగ్గుగిన్నె కిందబెట్టి సరస్వతి వచ్చి తండ్రిదగ్గరి పిల్లదాన్ని తీసుకొచ్చేసింది.

అతడు మంచంమీద లేచికూచుని, కిటికీగుండా ఆకాశాన బారెడెక్కి వచ్చిన సూర్యబింబాన్ని చూచాడు.

తరువాత మంచందగ్గిరే ముక్కాలిపీటమీద— తను రాత్రి ఆరంభించి, సగంరాసి, ఆపివేసిన కథ ఉన్న కాగితాలు కనిపించినై. పక్కనే సిరాలేని ఫౌంటెన్ కలం, దాన్ని మళ్ళీ ఏ స్నేహితుడింటికో తీసికెళ్ళి నింపుకొస్తే నే తప్ప మిగిలిన కథ పూర్తి అయేమార్గంలేదు.

మంచంమీదినించి లేచాడు. ఆ వాలు గోడలకూ ఒక్కటే, గాంధీపటం. అపరిగ్రహపరాయణు— అవతారమూర్తి వీక్షణంలోని వాత్సల్యం, దరహాసంలోని ప్రసన్నత్వం—ఈ ఒక్క ఉదయమే కాదు, ప్రతి ఉదయమూ—అతని కొ

అపూర్వ సహనశక్తిని ప్రసాదిస్తూనే ఉన్నవి.

పటం పక్కనే వంకెలకు తగిలించి మాసిపోయిన చొక్కాలూ, పంచలూను. ఇంటికివెళ్ళి, బ'మాలి పిల్చినా రావటంలేదు చాకలివెధవ. ఒక్క నెల జీతం బకాయి పడ్డందుకే ఏమి ఇబ్బంది పెడుతున్నాడు! ఇవాళ పండగరోజున ఒక్క ఇస్త్రీచొక్కాకూడా లేనట్టుందే!

అవతల—పిల్లకు ఉగ్గుపోసేముందు చిటికవేసి ఏడిపించింది తల్లి.

ఏ స్వర్గసౌధంనుంచో మెట్టుమెట్టునా జర్రున జారుతూ వచ్చి వాస్తవిక ప్రపంచంలో బొక్కబోర్లపడ్డాడు ఆ కవికుమారుడు.

కిశోర్ అన్నవాడు తానే ననీ, ఇంతకుముందే నిద్రలేచాననీ తన్ను తాను తెలిసికొన్నాడు.

౨

దొడ్లో ముఖం కడుక్కుంటూ కూచున్నాడు కిశోర్.

పిల్లకు ఉగ్గుపోసి, ఏడుపు సముదాయించి, మాడుకు ఆముదంపెట్టి, పాలిస్తూ కూచుంది మల్లాలో సరస్వతి.

'ఇవాళ పిల్లకు పాలడబ్బా కొనుక్కురావాలండీ!' ... 'మనకు బియ్యంకూడా అయిపోయాయి; ఈపూట కొస్తాయేమో, అంతే'... 'ఇవాళ పండగపూట ఒక్క కూరగాయకూడా లేదు ఇంటో'' ...'సరేగానండీ, ఎన్నిమార్లు చెప్పినా ఒక్క చొక్కాగుడ్డేనా తీసుకురారేం? పండగరోజులలో పిల్లదానికి వెధవ పాతచొక్కాలు తొడగటానికి సిగ్గేస్తుందేనూ! నే నెలాగూ ఒక రవికగుడ్డకూడా నోచుకోలేదనుకోండి; పసిదానిఖర్మంకూడా అంతేనా? డబ్బులేదు, డబ్బులేదు, అంటారు. ఇంతకూ దాని రాత...'

సరస్వతేనా ఆ పలికేది? తనభార్యా?...శత్రువా? ...ఆమె మాటలేనా అవి?...కత్తిపోటులా?—జేబులో నాలుగో, అయిదో అణాలు మాత్రమే ఉన్న సంగతి స్ఫురణకు తెచ్చుకుంటోన్న కిశోర్‌కు ఆమాటలు వింటోంటే ఒళ్ళంతా కంపరమెత్తినట్టనిపిస్తోంది.

'నే నెంత గొంతు చించుకుంటున్నా ఒక్కమాటైనా మాటాడరేమో చూడు! అరచి అరచి అదే ఊరుకుంటుందని మీ ఉద్దేశం. ఆడపిల్లకదా, సొమ్ములుచేయించి ఎలాగూ పెట్టలేం; ఇంతమంచి గుడ్డకూడా లేదే అని నా యేడుపు...'

'ఊరికె గొడవచేయకు, సరస్వతీ! సమయాసమయాలు ఆలోచించవేమిటి? మన మేమీ చక్రవర్తులం కాముకదా! పత్రికవాళ్ళ మనియార్డరుకోసం ఎదురుచూస్తూ ఉన్నాను. బహుశః ఇవాళ రావచ్చు. రాగానే పిల్లకూ, నీకూ—'

'అయ్యో, భాగ్యం!'

'ఏమిటి అలా గన్నావు?'

'ఏముంది? రానిబాకీలన్నీ మాకింద జమకడుతూంటారన్నమాట!'

'ఎబ్బే! ఇవాళ తప్పకండా మనియార్డరు వచ్చేస్తుంది. నావి అయిదు కథలు ప్రకటించుకున్నారు. ఉత్తరంకూడా రాశాను.'

'ఇంకా పంపండి, వేసుకుంటారు. మీకైన పోస్టుఖర్చులుకూడా రావు. వాళ్ళేం పిచ్చివాళ్ళు కాదు మీకుమల్లే.'

3

సరస్వతి అన్నట్టుగానే—

మధ్యాహ్నం భోజనాలు అయాక, పోస్టువాడు రాగానే ఆతృతతో 'మనియార్డరు వచ్చిందా?' అని అడిగి, 'లేదండి' అన్న జవాబుతో వాడిచ్చిన కార్డు ఒకటి మాత్రం నిరుత్సాహంగా అందుకుని, పంక్తి పంక్తికీ గుండె నీరయిపోతూంటే—

వాళ్ళ పత్రిక తరఫున రచయితల్ని పురస్కరించటం అలవాటులేదట — అదీ ఉత్తరంలో సారాంశం.

పళ్ళు కొరుక్కుంటూ కిశోర్ ఉత్తరాన్ని ఒకమూల గిరాటు వేశాడు. అటూ, ఇటూ నేల చూస్తూ పాదచ్ఛాయలు సాగించాడు. చివరకొగి ఒక గోడకు చేరగిలబడి నిల్చి, కిటికీలోంచి అవతల శూన్యంలోకి చూస్తూ ఉండి పోయాడు.

ఒక దీర్ఘనిశ్వాసం...

పొద్దున...పోనీ, ఎంతతక్కువకైనా సరే రాసిన నవల అమ్మేసుకుందాం అని పబ్లిషరు పుల్లయ్య కొట్టుకు వెళితే ... ఇవాళ కొత్త వస్త్రం పెడుతూ పూజ హడావుడిలో ఉన్నాడు. బీదకవుల రచనలు అతి చౌకలో కొట్టేస్తూ...బొర్ర పెంచేసుకుని...ఇవాళ ఎలా అలంకరించాడో కొట్టు! గుమ్మంముందు కదళీస్తంభాల్లో దుర్భోజనంతో కృశించి మడిసిన బీదకవుల కంకాళాలు...గుమ్మాలకు కట్టిన అవతోరణాల్లో పేదకవుల ఆకలిపేగులు...లోపల పెద్ద ధనలక్ష్మి విగ్రహం ఎంత, విజయగర్వంతో చూస్తోంది ఆ చుట్టూ బీరువాల్లో బంధింపబడివున్న సరస్వతివైపు. ఛీ అనుకుని

తిరిగి వచ్చేశాను పుల్లయ్యాతో మాటాడకండానే. ఇక నొక్క ఆశ ఉండే; అదికూడా ఆ ఉత్తరంతో అంతరించింది.

రచయితల్ని పురస్కరించటం ఆచారం లేదట! ఎందుకుంటుంది!...

ఛీ, తెలుగుదేశంలో పుట్టటమే తప్పు. అందులో రచయితకావటం పురాకృత పాపపరిపాకం. తెలిసికూడా ఆ వ్యాసారాన్నే అంటిపెట్టుకుని ఉండటం వట్టి బుద్ధితక్కువపని.

కిశోర్ దృష్టి అక్కడి మూలి పీటమీాది తన సగంరాసిన కథ ఉన్న కాగితాలమీదికి ప్రసరించింది. ముందుకు వడిచి అవి చేతిలోకి తీసుకున్నాడు.— పైసా విలువకూడా చేయనప్పుడు ఎందుకీ రచనలీ చింపి పారేస్తాను. ఇవాళ నించీ అస్త్రసన్యాసం.

వద్దు, వద్దు; అంతపనే! నీకు చేతకాదు. పోతనకాలంనాటినించీ దారిద్ర్యాంధకారకుహరాలలోనే ఆధ్యాత్మికపు వెలుగులు చిమ్ముతూ వస్తున్నాను. నన్ను చిదిమివేయలేవు—అంటూ సృష్టికర్తకుకూడా ఆశలు కల్పించే చిరునవ్వు చిలుకుతూ ఉత్తమకళాసరస్వతి ఆ కాగితాలలోంచి తొంగి చూస్తోంది.

చక్రవర్తికికూడా దొరకని అనందాన్ని తనకోసం విరివిగా పండిస్తోన్న సౌందర్యరాశి! ఆమెపై చెయి చేసుకోగలడా కిశోర్? కాగితాలు వక్షాన హత్తుకుంటూ, కన్ను లరమోడ్చి, తల పైకెత్తాడు.

మధుర మందహాసం కురిపిస్తున్నాడు గోడమీాది దరిద్రనారాయణమూర్తి.

౪

వంటయింటిపనులు ముగించుకుని వస్తూ 'ఏమండీ! మనియార్డరొచ్చిందా?' అంటోంది భార్య.

ఆ ప్రశ్నతో కిశోర్కు వొళ్ళుఝల్లుమన్నది. మనోవీధిలో మెరసిన తన ఆరాధ్యదైవతం, కళాసరస్వతి ప్రసన్న వదనం తిరోహితమై...ఎదుట ప్రత్యక్షమయింది భార్య సరస్వతి.

పండితులకు మాత్రమే

వాత్స్యాయన కామసూత్రములు

యశోధరుని జయమంగళ వ్యాఖ్యయు, మూలసూత్రములును తేటతెల్లమగు ఆంధ్రవివరణము, విశేషాంశములు, పీఠికతో సహా శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారిచే కూర్చబడిన పెద్దసైజున 800 పుటలుగల గ్రంథము- కామపురుషార్థమును గురించిన అన్ని సంగతులు గలవు.

రెండవ కూర్పు — రు 10—0—0 — పోస్టుఖర్చులు ప్రత్యేకము.

గ్రంథము విలువయును, యోగ్యతయును ఆంధ్రదేశమునందలి ప్రతియొక్కరును ఎఱింగియుండుటచేతను దీనిని గుఱించి విశేషించి వ్రాయనవసర ముండదు. విద్వాంసులు, భాషాపారిశ్రామికులు, చారిత్రికాన్వేషణము చేయు సజ్జనులు తప్ప ఇతరుల కెవ్వరికిని ఎంతమూల్యము నొసంగినను ఈ గ్రంథమును విక్రయించుటగాని, మఱి ఇతరవిధములగాని ఈయము. గ్రంథమును చక్కగా సంరక్షించుకొని దుర్వినియోగమునకుం దావీయమని వ్రాతమూలకముగా పూచీనిచ్చువారు మాత్రమే ఈగ్రంథము కొఱకై ఆర్డరులను పంపవలెను. పాఠశాలలు, కళాశాలలు మొదలైనవాటిలో చదువు విద్యార్థులును; స్త్రీలును; గ్రంథమునుగాని, గ్రంథస్థములగు విషయములనుగాని సంరక్షణచేసికొనం జాలని ఇతరులును ఈ గ్రంథమునకు ఆర్డర్లు పంపవలదు.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.

చేతిలోని కాగితాల్ని తిరిగి ముక్కాలిపీటమీద పెట్టేస్తున్నాడు కిశోర్.

'మాటాడరేం? మనియార్డరొచ్చిందా?'

వెధవ ప్రశ్న! ఈ ప్రశ్నను ఎదుర్కోవలసి ఉంటుందని పోస్టువాడు వచ్చి వెళ్ళినప్పుడే ఫికరు పడ్డాడు. ఏమి సమాధానం చెప్పి, ముప్పు తప్పించుకోవాలో ఇంతవరకూ పాలుపోవటంలేదు.

వొళ్ళు జలదరింపజేసే ప్రశ్న! ఏం, ఇప్పుడొచ్చి ఈసరస్వతి ఆ ప్రశ్నే పదే పదే అడక్కపోతే? ఏం మునుకుపోతోందని?

'చెప్పరేమిటండీ, ఎన్నిసార్లడుగుతున్నానూ!'

అదిగో మళ్ళీ... జవాబు చెప్పలేదని ఊరుకుంటుందేమో చూడు! ఎందుకూరుకుంటుంది? ప్రాణాలు తోడేస్తుంది గాని. నా దారిద్ర్యాన్ని నాముందు బట్టబయలుగా, అతివికృతరూపంలో, ప్రదర్శించి—సంసారం ఈదలేని నా అసమర్థతను నాకు స్ఫురింపజేస్తూ — ఆత్మహత్యనే ప్రబోధిస్తూ — నేను చచ్చేవరకూ ఊరుకోదు.

'ఇంకా పోస్టువాడు రాలేదా?'

'అప్పుడే వచ్చాడామరి?'— అని తొందరగా అనేసి కాస్త ఊపిరి పీల్చుకోగలిగాడు కిశోర్.

'అసంగతే చెప్పేయకూడదూ? అలా బెల్లంకొట్టిన రాయిలాగ ఉండకపోతే. మీ దంతా తమాషా అండీ!...అరే, ఆ వుత్తరం ఎక్కడిది మరి?'—ఆ మూల ఉత్తరంమీద ఆమెదృష్టి పడనేపడ్డది.

'అదా? నిన్న వచ్చిన ఉత్తరం కామాల్లే' అంటూ ఉత్తరీయం వంకెమీదినించి తీసి బుజాన వేస్తున్నాడు.

ఇంకా తా నక్కడే ఉంటే చాలా గ్రంథం పెరిగే అవకాశాలున్నై. ఆమె ఉత్తరం చదివేసిందంటే, 'అఁ నే చెప్పానుకాదూ' అని విజయపతాకం ఎత్తుతుంది. ఓడిపోయిన రాజులాగ గడ్డికరుస్తూ తాను ఆమెముందు...ఉహుఁ, సహించలేడు. అదికాక తానబద్ధం ఆడాడు. దానిమీద ఆవిడ వ్యాఖ్యానం చేస్తుంది. ఎప్పుడూ ఇలాగే అబద్ధాలాడే వాణ్ణిలాగే మాటాడేస్తుంది. అనా డిట్లా—ఈనా డిట్లా—అని ఎప్పటెప్పటి విషయాలో తవ్వుకొస్తుంది—ఓ, చాలా సంగతులొస్తాయి...

సరస్వతి ఉత్తరం అందుకుని పూర్తిగా చదివేసింది. 'నాతోకూడా అబద్ధా లెందుకండీ!' అంటూ వెనక్కు తిప్పింది ముఖం.

కాని ఏడీ కిశోర్! చరచరా వీధిగుమ్మంవద్దకు వచ్చింది సరస్వతి. కిశోర్ అప్పుడే సందు మలుపు తిరుగుతున్నాడు.

సరస్వతి కన్నులు చెమ్మగిల్లినవి.

డబ్బుకు భర్తను వొత్తిడిచేయటం తప్పే. ఇక నెప్పుడూ చేయనని నిశ్చయించుకుంది. కాని మరి యిల్లు గడకటమో! అది తీరని సమస్యగానే ఉండిపోయింది.

లోపల...గదిలోకి పాకివచ్చి తలెత్తి గాంధీబొమ్మకేసి చూస్తూ, ఏదో అర్థంకాని ఆనందంతో జిలిబిలికేకలు వేస్తున్న పాప తల్లిదుఃఖానికి ఉపశమనం చెప్పింది.

కథల పుస్తకాలు

కారుణ్యం	0	4	0
—కొడవటిగంటి కుటుంబరావు			
రూమ్ టు లెట్	0	4	0
—పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి			
స్వగతం	0	4	0
—కొడవటిగంటి కుటుంబరావు			
కలికి	0	4	0
—బొడ్డు బాపిరాజు			
బాహ్యణీకం	0	4	0
—గుడిపాటి వెంకటచలం			
యువ కథావళి	0	4	0
—వివిధ రచయితలు			
ఇల్లరికం	0	4	0
—కొడవటిగంటి కుటుంబరావు			
పాంచజన్యం	0	6	0
—చక్రపాణి			
బడదీదీ	0	4	0
—చక్రపాణి			
త్రిలోచన కవిరాజు	0	6	0
—చక్రపాణి			
గళ్లచీర (9 కథలు)	0	8	0
– పురాణం కుమారరాఘవశాస్త్రి			
ఉద్యానం (5 కథలు)	0	5	0
– పురాణం కుమారరాఘవశాస్త్రి			

[పోస్టు ఖర్చులు ప్రత్యేకము]

ఆంధ్రభూమి బుక్ డిపో

వేపేరి మదరాసు.